


# స్వాగతం

డిసెంబరు నెల !

క్రిస్మస్ పండుగ కోలాహలం!

క్రిస్మస్ తాత వస్తాడు.... ఏదో ధ్రువప్రాంతం నుండి, ధ్రువపు జింకలు లాగే స్లెడ్జ్ బండి ఎక్కి, తెల్లటి బరివి గడ్డంతో, నవ్వు నిండిన ముఖంతో, ఎర్రటి ఊలు అంగీతో. ఆ అంగీనిండా లోతైన జేబులు...జేబులునిండా టాఫీలూ, చాక్లెట్లూ, బహుమతులూ! అందరికీ అన్నీ అందిస్తాడు సంతోషంగా, నిర్విరామంగా. ఏ పిల్లలు ఇష్టపడరు ఆయన్ని?

ఊరూరా నక్షత్రాలను పోలిన స్వాగత చిహ్నాలూ, వాడవాడలా రంగురంగుల బట్టలూ, పండుగ వాతావరణం.

నూతన సంవత్సరానికి ఆహ్వానం, చర్చిల గంటలు, ప్రార్థనాగీతాల సాధనలు.

మంచుకురిసే ఉదయాలు. మబ్బుతునకలు లేని ఆకాశంలో కిక్కిరిసిపోయి, ఇక ఎప్పుడు బయటకి ఊడిపడతాయో అనిపించే తారల రాత్రులు.

వణికించబోతున్నాను సిద్ధంకండని హెచ్చరించే వెచ్చని చలి.

అన్నింటినీ మించి పిల్లల్ని ఊరించే శలవలు.

ఇన్ని సంతోషకర విషయాల నడుమ అందరం మరోసారి పరిశుద్ధ ప్రవక్త, దేవుని కుమారుడూ అయిన ఏసు ప్రభువులోని గుణాలను మరోసారి స్మరిద్దాం. కరుణామయుడూ, విస్వాసుల రక్షకుడూ అయిన ఆ ప్రభువు చూపిన సత్యమార్గంలో మనమూ పయనించేందుకు ప్రయత్నిద్దాం. విద్వేష కావేశాలను, మారణకాండల్నీదూరంచేసుకొని మన హృదయాలలోనూ పవిత్రతను నింపుకుందాం. హింస, పరపీడనల్ని దైవం ఏనాటికీ మెచ్చదని మరోసారి గుర్తుచేసుకుందాం. మతం ఉన్నది మనుషుల్ని దూరం చేయటానికి కాదనీ, మనసుల్ని దగ్గర పరచేందుకు ఉద్దేశించినదనీ చాటుదాం.

విశ్వాసపు బలాన్ని, ప్రేమ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన అద్భుత వ్యక్తి ఏసు ప్రభువు. డిసెంబరు నెల 25 న ఆయన జన్మ దినాన్ని పురస్కరించుకొని కొత్తపల్లి బృందం మీకందరికీ శుభాకాంక్షలను అందిస్తున్నది.

నవంబరు పధ్నాలుగు సందర్భంగా చెన్నేకొత్తపల్లిలో నిర్వహించిన కథలపోటీల్లో చాలామంది పిల్లలు పాల్గొన్నారు ఉత్సాహంగా. వారి రచనల్లో కొన్ని ఈసారి కొత్తపల్లి పత్రికలో చోటు చేసుకుంటున్నాయి. వీటిలో అధిక భాగం జానపదకథలు. అవీ ఇవీ కలుపుకొని, పిల్లలు సొంతంగా తయారుచేశారని వీటిని చూడగానే తెలుస్తుంది. వారికి స్ఫూర్తినివ్వటం, చదువరులకు చిరునవ్వునందించటం ఈ కథల ప్రచురణ వెనక గల మూలోద్దేశం.

ఈ సంచికలో చిత్రాలను సకాలంలో అందించి తోడ్పడిన బి యఫ్ ఎ (జె యన్ టి యు) విద్యార్థులు శివ ప్రసాద్, సాయి కిరణ్, యాదగిరి లకు కొత్తపల్లి బృందం ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నది.

ఇక, ఆదిలాబాదు జిల్లా, చెన్నూరు మండలకేంద్రానికి దగ్గర్లో ఉన్న భావురావు పేటలోని ప్రభుత్వ ప్రాధమికోన్నత పాఠశాల విద్యార్థులు పంపిన పాటలు ఈమాసపు కొత్తపల్లికి ప్రత్యేక ఆకర్షణలు. ఆ విద్యార్థులకు, వారికి స్ఫూర్తినిచ్చిన ఆ పాఠశాల అధ్యాపక వర్గానికి మనందరి తరపున కృతజ్ఞతాభినందనలు.

మీ-

కొత్తపల్లి బృందం.

# బుడ్డ మిరపకాయ కథ

*'టింగరు బుల్లయ్య' అని మంత్రం వేస్తే ఎంతటి శత్రువులైనా చనిపోతారట. అయితే ఆ మంత్రాన్ని దుర్వినియోగం చేసిన బుడ్డమిరపకాయ గతి ఏమైందో ఈ కథ చెబుతుంది. అభినవ భస్మాసురుడు బుడ్డ మిరపకాయ ఆంధ్రప్రదేశ్ లోని పిల్లలు చాలామందికి తెలుసు. మీకూ తెలుసేమో, చూసుకోండి మరి!*



*రచన: నాగార్జున, ఏడవ తరగతి, టింబక్టు బడి, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా.*

ఒక ఊరిలో ఒక అవ్వ నివసిస్తూ ఉండేది. ఒక నాడు ఆ అవ్వ కూరగాయలు తీసుకరావడానికని సంతకెళ్ళింది. సంతలో అవ్వ చాలా కూరగాయలు కొన్నది. వాటిలో ఒక బుడ్డ మిరపకాయ ఉన్నది. అవ్వ బస్సెక్కి ఇంటికి వెళ్ళింది. బస్సులోంచి బయటికి దూకిపోదామని బుడ్డమిరపకాయ చాలా ప్రయత్నించింది, కానీ తనను ఎవరైనా తొక్కేస్తారేమోనని భయపడి కూరగాయల బ్యాగ్ లోనే ముడుక్కున్నది.



ఇంటికి చేరుకున్న అవ్వ ఏమిచేద్దామా అని ఆలోచించి, మిరపకాయ బజ్జీలు చేద్దామనుకున్నది. బజ్జీలకోసమని మిరపకాయలను తీసుకొని, వాటికున్న తొటాలను తీసింది. బుడ్డ మిరపకాయ వంతు వచ్చేప్పటికి, అది 'అవ్వా! అవ్వా! నన్ను ఏమీ చేయ్యొద్దవ్వా! నువ్వు ఏమి సహాయం చెయ్యమన్నా చేసిపెడతాను' అని ప్రాధేయపడ్డది. సరేనన్నది అవ్వ. బుడ్డ మిరపకాయకు ఒక పరక ఇచ్చి, ఇల్లంతా ఊడ్చమని చెప్పింది. బుడ్డ మిరపకాయ సరేనన్నది, కానీ ఇల్లు ఊడ్చకుండా మంచమెక్కి కాలు మీద కాలేసుకుని కూర్చుంది. అప్పుడు అవ్వ దాన్ని పరకతో కొట్టింది. అప్పటినుంచీ బుడ్డ మిరపకాయ బుద్దిగా ఉన్నది.

ఒకనాడు బుడ్డ మిరపకాయ అవ్వతో, 'అవ్వా! ఇకనుంచీ నేను బడికి పోతానవ్వా!' అని అడిగింది. అందుకు అవ్వ 'సరే'నని ఒప్పుకుంది. బుడ్డ మిరపకాయకు ఒక పలకా, ఒక బలపం ఇచ్చి బడికి పంపింది. బుడ్డ మిరపకాయ పలకా, బలపం తీసుకొని బడికి వెళ్ళింది. ఆ రోజున బడిలో టీచరు ప్రజెంటు వేస్తూ, 'బుడ్డ మిరపకాయా' అన్నది. అప్పుడు పిల్లలంతా గట్టిగా నవ్వారు. ఆరోజున బుడ్డ మిరపకాయ '

అ ' 'ఆ ' లు నేర్చుకుంది. సాయంత్రం ఇంటికి వెళ్ళేప్పుడు పిల్లలందరూ బై, బుడ్డ మిరపకాయా! బైబై బుడ్డ మిరపకాయా!' అని ఎగతాళి చేశారు.

ఇంటికెళ్ళిన బుడ్డ మిరపకాయ అవ్వతో, 'అవ్వా! నన్నంతా 'బుడ్డ మిరపకాయా' అంటున్నారవ్వా!' అని చెప్పింది. అప్పుడు అవ్వ 'ఏడుకొండల అవతల ఒక ఋషి ఉన్నాడు. అక్కడికి వెళ్ళి ఆయనను అడుగు. ఏమి చేయాలో ఆయనే చెబుతాడు' అని చెప్పింది. బుడ్డ మిరపకాయ ఏడుకొండలు దాటి, అక్కడున్న ఋషిని కలిసి, తన బాధను చెప్పుకొంది. ఋషి " టింగరు బుల్లయ్య " అని దానికి ఒక మంత్రం ఉపదేశించి, 'ఈ మంత్రం చాలా శక్తివంతమైనది. దీన్ని సరిగా వాడితే లోక కల్యాణం జరుగుతుంది. చెడు పనులకు వాడితే వినాశనం తప్పదు' అని హెచ్చరించాడు.

తిరిగొచ్చిన బుడ్డ మిరపకాయ మర్నాడు బడికి వెళ్ళింది. 'హాయ్ బుడ్డమిరపకాయా' అన్నారంతా. 'నన్నే బుడ్డ మిరపకాయంటారా!' అని మండిపడ్డ బుడ్డ మిరపకాయ, "పిల్లలంతా టింగర్ బుల్లయ్య" అన్నది. అంతే! పిల్లలంతా చనిపోయారు. టీచరు వచ్చి 'ఒరేయ్! బుడ్డ మిరపకాయా! అందర్నీ లేపురా' అని అన్నది. 'నన్నే బుడ్డ మిరకాయంటావా! టీచరూ?' "టీచరూ టింగరు బుల్లయ్య" అన్నది బుడ్డ మిరపకాయ. అంతే! టీచరు కూడా చనిపోయింది.

ఇక బుడ్డ మిరపకాయ తీరికగా ఇంటికెళ్లింది. ఇంట్లో అవ్వ 'ఒరేయ్! బుడ్డ మిరపకాయా! అరటి పండు తింటావారా?' అని అడిగింది ప్రేమగా. గర్వపోతు బుడ్డ మిరపకాయ "నన్నే బుడ్డ మిరపకాయంటావా" అని, "అవ్వకూడా టింగరు బుల్లయ్య" అన్నది బుడ్డ మిరపకాయ. అంతే! అవ్వ కూడా చనిపోయింది.

తర్వాత బుడ్డ మిరపకాయకు ఆకలైంది. అది ఒక అరటి పండును తీసుకొని అద్దానికి ఎదురుగా నిలబడింది. తన అందాన్ని చూసుకొని మురిసిపోయింది. తినటంకోసం పండు తొక్క ఒలిచింది. అద్దంలో బుడ్డ మిరపకాయ ప్రతిబింబం కూడా అరటిపండు తొక్కను ఒలిచింది.

ఆత్మదురభిమానం ఎక్కువ అయిన బుడ్డమిరపకాయకు కోపం వచ్చింది. "ఆ! నేనెలా చేస్తే నువ్వూ అలానే చేస్తావా! నువ్వు కూడా టింగరు బుల్లయ్య" అన్నది. అంతే! ప్రతిబింబంతోపాటు బుడ్డ మిరపకాయకూడా చనిపోయింది!

అహంకారం వినాశహేతువు.

# అత్త-కోడలు

*మన జానపదంలో అత్తాకోడళ్లు ఒకరికొకరు ఎందుకంత శత్రువులయ్యారో గాని, లెక్కలేనన్ని కథలకు వీళ్లు మహారాణులయ్యారు. హరిత రాసిన ఈ కథ అదే నేపథ్యంగా మొదలై, అటూ ఇటూ తిరిగి, చివరికి బీర్బల్ తెలివితో ముగుస్తున్నది. చిత్తగించండి.*

*రచన: హరిత, ఎనిమిదవ తరగత, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి.*





ఒక ఊరిలో ఒక మహా రాక్షసిలాంటి అత్త, తన కొడుకూ, కోడలితో ఉండేది. ఆ అత్త తన కోడలిని నానా కష్టాలకూ గురిచేసేది. పాపం ఆ కోడలు అత్తపెట్టే కష్టాలన్నింటినీ ఓపికగా భరిస్తూ ఉండేది. రాను రానూ ఆ అత్త ఆగడాలకు అంతే లేకుండా పోయింది. తన కోడలికి సరిగ్గా అన్నం కూడా పెట్టకుండా వేధించసాగింది ఆ అత్త. ఒక నాడు వారి పెరట్లో కాసిన కాకరకాయలు అమ్ముకు రావడానికని అత్త ఊళ్ళోకి వెళ్ళింది. అప్పటికి అన్నం తినక చాలా రోజులయింది

కోడలికి. అత్తలేని ఆ సమయంలో, ఆమె చకచకా ఒక బానెడు అన్నమూ, సగం బానెడు కాకరకాయ కూరా చేసుకున్నది - అత్తరాకనే వాటిని తినేయాలని. మొత్తం అన్నంలోకీ కూరను కలిపి రెండు పిడసలు(ముద్దలు) చేసి, ఒక్కో పిడసను ఒక్కోసారిచొప్పున రెండింటినీ రెండుసార్లకే మింగేసింది ఆ కోడలు. అది చూసిన ఆ ఊరి దేవత `పెద్దమ్మ' తన ముక్కుమీద వేలేసుకొంది.

ఊరంతా ఇదో మహాశ్చర్యకరమైన సంగతైంది. పెద్దమ్మ ముక్కుమీద వేలేసుకోవడం తెలిసిన ప్రజలంతా గుంపులు గుంపులుగా వెళ్లి చూడటం మొదలు పెట్టారు. ఇంకో గంటకల్లా సంగతి ఆ ఊరి పెద్ద వరకూ చేరుకున్నది. 'పెద్దమ్మ ముక్కుమీద వేలేసుకోవడం ఊరికి మంచిది కాదు; ఆ తల్లి తన ముక్కు మీదనుంచి వేలును తీసేట్టు చేసినవారికి వెయ్యిరూపాయలు బహుమతిగా ఇస్తామ'న్నారు ఆ గ్రామ పెద్ద . 'కానీ ముందుకొచ్చిన తర్వాత అలా చెయ్యలేకపోతే వారికి మరణ శిక్ష విదిస్తామనికూడా జోడించారు చల్లగా.

ఇక ఎవరూ ముందుకు వచ్చేసాహసం చేయలేదు. కానీ ఈ సంగతి తెలుసుకున్న అత్తకు మాత్రం చాలా సంతోషం కలిగింది. "వస్తే వెయ్యి రూపాయలొస్తాయి. లేకపోతే కోడలి పీడ వదిలిపోతుంద"ని తన కోడలిని ముందుకు తోసింది.

కోడలు బాధ పడింది. అయినా చేసేదేమీ లేదు. ఒక చాటా, ఒక

పరకా, ఒక చెప్పు తీసుకొని వెళ్ళింది పెద్దమ్మ గుడికి. "ఏమమ్మా! పెద్దమ్మా! నేను నా కడుపాత్రంతో రెండు బానల అన్నం తింటే నీకెందుకంత మంట? అన్నది. అంతే! పెద్దమ్మ గాభరా పడింది. ఆతల్లి ముక్కు మీది వేలు క్రిందికి జారింది.

పెద్దమ్మ తన ముక్కు మీద నుంచి వేలు తీసేయడానికి కారణం ఆ కోడలే అని మర్నాటికల్లా ఊరంతా తెలిసింది. ఆమెకేవో గొప్ప శక్తులున్నాయని అందరూ చెప్పుకొన్నారు. అది విన్న అత్తకు గుండెల్లో గుబులైంది. ఈ మంత్రాల కోడలు తననేమి చేస్తుందోనని, కోడలిని చంపడానికి పూనుకున్నది. గుట్టుగా ఆమెను కట్టెతో వాయించింది. ఆ దెబ్బలకు తాళలేక కోడలు పడి మూర్ఛ పోయింది. 'కోడలు చని పోయిందో' అని రాగాలు తీసింది అత్త.

చనిపోయిందనుకొన్న కోడల్ని ఆమె అత్తా, భర్తా స్మశానానికి తీసుకు వెళ్లారు. చితిపేర్చి, చితిమీద ఆమెను పడుకోబెట్టారు. తీరాచూస్తే చితిని అంటించడానికి అగ్గిపెట్టెలేదు. అగ్గిపెట్టె కోసమని ఆత్రంగా ఇంటికెళ్ళారు వాళ్లిద్దరూ. అంతలో కోడలికి స్పృహ వచ్చింది. చూసుకుంటే తను ఒంటరిగా చితిమీద ఉన్నది! వెంటనే ఆమె లేచివెళ్ళి, దగ్గర్లోనే ఉన్న ఒకపెద్ద చెట్టు పైకెక్కి కూర్చుంది. ఇంతలోనే అగ్గిపెట్టెను తీసుకొచ్చారు అత్తా, భర్తానూ. ఇద్దరూ వచ్చీ రాగానే చితిమీద శవం ఉన్నదీ, లేనిదీ కూడా చూడకుండా చితికి నిప్పుపెట్టి వెళ్ళిపోయారు.

ఇక చెట్టుమీదున్న కోడలు బాగా అలసిపోయింది; నిద్రకు తూగుతూ కూర్చున్నది. ఇంతలో ఎక్కడో దొంగతనం చేసుకొని, ఒక పెద్ద దొంగలముఠా అక్కడికి చేరుకున్నది. దొంగిలించిన సొమ్మును వాటాలేసుకోవడానికి అనువైన నిర్మానుష్యయ ప్రదేశంకోసం వెతుక్కున్నారు వాళ్లంతా. చివరికి అందరూ కోడలున్న చెట్టుకిందే కూర్చొని తమ దగ్గరున్న బంగారం మూటలను విప్పారు.

సరిగ్గా అప్పుడే చెట్టుమీద తూగుతూ కూర్చున్న కోడలు, పైనుండి దబ్బుమని కిందపడిపోయింది. ఒక్కసారిగా చెట్టుపైనుండి పడిన ఆమెను చూసిన దొంగలు అదేదో పెద్ద దెయ్యమనుకున్నారు. హాహాకారాలు చేస్తూ లేచి ఉన్నపళాన కాలికి బుద్ధి చెప్పారు. మెలకువ వచ్చి తేరుకున్న కోడలు ఆ నగలన్నింటినీ ధరించి ఇంటికెళ్ళి, వాళ్ళ ఇంటి ముందు కూర్చుంది. ఆమెను చూసిన భర్త సంతోషపడ్డాడు. కానీ అత్తకు మాత్రం చెప్పరాని భయం వేసింది, కోడలు దయ్యమై తిరిగొచ్చిందని.

అప్పుడా కోడలు "నేను దెయ్యాన్ని కాలేదు. చనిపోయాక నరకానికి వెళితే దెయ్యాలవుతాము. కానీ నేను వెళ్ళింది స్వర్గానికి. అక్కడ నేను మీ చుట్టాలనూ, మా చుట్టాలనూ అందర్నీ పలకరించి వచ్చాను. అక్కడున్న మీ చుట్టాలకు నిన్ను చూడాలని ఉందట, 'నువ్వు వెళ్ళి మీ అత్తను పంపు' అని వాళ్లంతా నాకీ ఆభరణాలు ఇచ్చి పంపారు. నువ్వుకూడా వెళితే నీక్కూడా చాలా సత్కారం చేస్తారట' అన్నది.

అది విన్న అత్తకు ఆశ పుట్టింది. "అవునా! అయితే సరే, నేనూ వెళతాను. కానీ నేనక్కడికి వెళ్లడం ఎలా?' అని ఆ అత్త అడిగింది.

"ఏముందీ? నువ్వుకూడా ఓసారి బడితతో పూజ చేయించుకుంటే సరి' అన్నదా గడసరి కోడలు. "అయితే ఆలస్యం ఎందుకు? ఆమెను వాయించిన కట్టెతోటే నన్నూ బాదండి' అన్నది ఆశపోతు అత్త.

సంగతి అర్థమైన కొడుకూ, కోడలు ఇద్దరూ కలసి అత్తను పైకి పంపారు. తిరిగొచ్చే అమ్మను తలుచుకుంటూ కొడుకూ, తిరిగిరాని అత్తను తలచుకుంటూ కోడలూ, ఉన్న సొమ్ముతో హాయిగా కాలం గడిపారు.

# బాపనాయని కల

*పగటికలలు కనటం మనందరం చేస్తూనే ఉంటాం. నిజానికి మనం సాకారం చేసుకోవాలనుకునే కలలకూ, మనమనే పగటి కలలకూ తేడాని మనమే కాదు, ఎవ్వరూ కనుగొనలేరు. పగటి కలలు కంటూ ప్రస్తుత వాస్తవాల్ని మరచిపోతే ఏమవుతుందో ఈ సరదా కథ 'బాపనాయని పగటికల' చెబుతుంది. చదవండి.*



*రచన: నరసింహా రెడ్డి, తొమ్మిదో తరగతి, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి*

ఒక ఊరిలో ఒక బ్రాహ్మణుడు ఉండేవాడు. పెళ్ళిళ్ళు, గృహ ప్రవేశాలవంటి సమయాలలో మంత్రాలు చదవటానికి వెళుతూ వచ్చిన సొమ్ముతో జీవిస్తుండేవాడు. అతని భార్య ఒక గయ్యాళి. ఆమెతో వేగలేక చచ్చేవాడు పాపం బాపనాయన. వారికి పిల్లలు మాత్రం లేరు.

బాపనాయనికి తను పెద్ద ధనవంతుడైపోవాలని చాలా కాలం నుంచీ కోరిక. కానీ రాబడి తక్కువగా ఉండటంతో ఆ కోరిక ఎంతకీ తీరకుండా ఉన్నది. దాంతో ఆయన నిరుత్సాహపడుతూండేవాడు. కానీ, ఎప్పటికైనా తను ఒక పెద్ద ధనవంతుడవ్వాల్సిందేనని అతనికి నమ్మిక. కొంచెం తీరిక దొరికిందంటే చాలు- తను ధనవంతుడైనట్లు కలలు కనేవాడు.

ఒకసారి ఆయనకు ఒక పేదవాని ఇంట్లో పెళ్ళికి పౌరోహిత్యం

దొరికింది. దక్షిణగా ఆ పేదవాడు ఒక బానెడు పాలిచ్చాడు బాపనాయనికి.

బాపనాయన ఆ బానెడు పాలనూ తీసుకొని ఇంటికి పయనమయ్యాడు. అప్పటికే బాగా ఎండయ్యింది. దారిలో కొంచెంసేపు విశ్రాంతి తీసుకుందామని ఒక చెట్టుకింద కుండను దింపి, తన పక్కనే ఆ పాల బానను ఉంచుకొని , నిద్రపోయాడు. నిద్రలో ఎప్పటిలానే బాపనాయన్ని ధనవంతుడిని చేసే కలలు రావడం మొదలయ్యాయి.

ఆయన తన దగ్గర ఉండే పాలను అమ్మి, కొన్ని కోడి పిల్లలను కొన్నాడు. పిల్లలు పెద్దవయ్యాయి. అవన్నీ ఇక గుడ్లు పెట్టి, పొదిగాయి. గుడ్లన్నీ పిల్లలయ్యాయి. అవన్నీ పెరిగి పెద్దవయ్యాయి. వాటికి పిల్లలయ్యాయి. అవిపెద్దవయి, వాటికి పిల్లలు, మళ్ళీ వాటికి పిల్లలు....ఇలా తన దగ్గర ఇప్పుడు చాలా కోళ్ళున్నాయి.

ఇక బాపనాయన ఆ కోళ్లన్నిటినీ అమ్మేశాడు. మేకలు కొన్నాడు. ఆ మేకలకూ పిల్లలు పుట్టాయి. వాటికి అన్నిటికీ మళ్ళీ పిల్లలు!. అలా పేద్ద మేకల మంద తయారైంది.

బాపనాయన ఇక వాటిని అన్నింటినీ అమ్మేశాడు. గొర్రెలు కొన్నాడు. గొర్రెలు పెద్దవయ్యాయి. వాటికి పిల్లలు పుట్టాయి. అవీ పెద్దయి, వాటికి కూడా పిల్లలు పుట్టాయి. గొర్రెలన్నీ ఎక్కువై, పెద్ద మంద

తయారయ్యాక, బాపనాయన వాటిని అన్నింటినీకూడా అమ్మేశాడు.వాటిని అమ్మి , ఈసారి ఆవులను కొన్నాడు. ఆవులకు దూడలు, ఆ దూడలు ఆవులయి, ఆ ఆవులకు మళ్ళీ దూడలు. ఆ దూడలు ఆవులయి వాటికి మళ్ళీ దూడలు. ఇప్పుడతని దగ్గర వందల కొద్దీ ఆవులూ , దూడలూ ఉన్నాయి.

ఆవులన్నీ ఇచ్చే పాలతో పెరుగూ, వెన్నా, నెయ్యీ అన్నీ తయారవుతున్నాయి. చాలా తొందరగానే అతను ఒక పెద్ద ధనవంతుడయిపోయాడు. ఇప్పుడతనికి కావలసినవన్నీ ఉన్నాయి. అతను ఊరికే కూర్చున్నా , అన్నీ తన ముందుకే వచ్చేంత ధనవంతుడు అయిపోయాడు.



ఎన్ని ఉన్నా ఏం లాభం, తన భార్య గయ్యాళిది! అయినా ఇప్పుడు తనకేమి? తను గొప్ప ధనవంతుడు! మరో పెళ్ళి చేసుకున్నాడు. రెండవ భార్యతో సుఖంగా ఉంటున్నాడు. అప్పుడు మొదటి భార్య తన దగ్గరకు వచ్చింది. బజారుకెళ్ళి, కూరగాయలు తెమ్మంది! "నా అంతటి వాడిని,

బజారుకెళ్ళి కూరగాయలు తెమ్మంటావా?" అని కోపంగా అరిచాడు బాపనాయన. తనను అంతగా అవమానించిన ఆ గయ్యాళికి బుద్ధి చెప్పదలచాడు. ఎత్తి, కాలితో ఒక్క తన్ను తన్నాడు. 'ఢబాలు'మని పెద్దగా శబ్దం వచ్చింది.

బిత్తరపోయిన బాపనాయన గబుక్కున లేచాడు. చూస్తే తనున్నది అడవిలో చెట్టుకింద! తను తన్నింది పాల కడవను! తనకున్నది ఆ కడవెడు పాలు మాత్రమే.. అవీ ఇప్పుడు నేలపాలయ్యాయి. తన తన్ను తాపుకు బాన పగిలి , పాలన్నీ నేలపాలయ్యాయి.

పాలకుండ పగిలి పోయింది. పాపం, బాపనాయని కల చెదిరిపోయింది.

# రాము సోముల కథ

*విఠలాచార్య బ్రతికి ఉండి, టార్జాన్ కథకి ఈ 'రాము సోము..' ప్రతిరూపం అని భావించకపోతే దీన్ని సినిమాగా తీసి ఉండేవారేమో. నిజం! ఆ నాటి జానపద సినిమాల్లో ఉన్నన్ని మలుపులు, మూసపోత అంశాలు ఈ కథలోనూ కనిపిస్తాయి. చదివి ఎలా ఉందో చెప్పండి.*



*రచన: చంద్ర శేఖర్, తొమ్మిదో తరగతి, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి.*

ఒక ఊరిలో కోనయ్య - పార్వతమ్మ అనే దంపతులు నివసిస్తూ ఉండేవారు. వారికి ఇద్దరు మగ పిల్లలు పుట్టారు. పిల్లలు పుట్టగానే పార్వతమ్మ చనిపోయింది. కోనయ్య పిల్లలను పెంచలేక ఒక పెద్ద అడవిలో వదలి వెళ్ళిపోయాడు. పిల్లలిద్దరూ ఆ అడవిలో ఆకలితో ఏడుస్తుండగా విని, అడవిలోని ఏనుగొకటి అక్కడికి వచ్చి ఒక అబ్బాయిని తీసుకు పోయింది. మరొక పిల్లవాణ్ని కోయవాళ్ళు వచ్చి తీసుకు పోయారు. ఏనుగు దగ్గర ఉన్న వాని పేరు రాము. కోయవాళ్ళ దగ్గర ఉన్నవాని పేరు సోము.

రాము అడవిలోని జంతువులన్నింటితోటీ స్నేహంగా ఉండేవాడు. అడవిలోని జంతువులు, పక్షులు ఏవైనా ప్రమాదంలో ఉంటే వెళ్ళి కాపాడేవాడు.

ఒకసారి ఇంగ్లీషువాళ్ళు కొందరు అడవిని చూడటానికి వచ్చారు.

వారిలో ఒకావిడ , ఒకనాటి రాత్రి అడవిలోకి వెళ్లింది. ఒక సింహం ఆమెపై దాడి చేస్తుండగా, రాము వెళ్ళి ఆమెను కాపాడాడు. ఆమెను వాళ్ల ఇంటికి తీసుకెళ్ళి, గాయాలకు పసరులు రాసి, గాయాలను బాగుచేసి పంపాడు.



ఇక సోము కోయవాళ్ల దగ్గర యుద్ధం చేయడం, జంతువులను వేటాడటం లాంటి విద్యలన్నీ నేర్చుకున్నాడు. ఒకసారి సోము వేటకని అడవికి వెళ్ళాడు. అక్కడ అతను ఒక జింకను చంపటానికి ప్రయత్నిస్తుండగా, అది గమనించిన రాము జంతువులను చంపరాదని అడ్డుపడ్డాడు. సోము కోపంగా తనకు అడ్డురావొద్దనీ, అది తన వృత్తి అనీ చెప్పాడు. అయినా రాము ఒప్పుకోలేదు. అలా వేటాడటానికి వీలు లేదన్నాడు. ఇద్దరి మధ్యా గొడవ మొదలై యుద్ధానికి దారితీసింది. వారిద్దరూ పోట్లాడుకుంటుండగా, ఏనుగూ, కోయవాళ్ళూ వచ్చి వారిని ఆపారు. రూపు రేఖలు ఒకేలా ఉండటం చూసి, వారిద్దరూ అన్నదమ్ములేనని తేల్చారు. అప్పటినుండీ వారిద్దరూ కలసి ఆ అడవిని బాగా కాపాడుకోవటం మొదలుపెట్టారు.

అంతలో ఒకసారి, కొందరు దుండగులు ఆ అడవికి ఏనుగు దంతాలకోసం వచ్చారు. ఏనుగులను వేటాడటం చూసిన రాము, సోములు వారిని అడ్డుకున్నారు. కోయవాళ్ల సహాయంతో వారిని అక్కడినుండి తరిమేశారు.

మరోసారి ఆ అడవిలో వజ్రాలు దొరుకుతున్నాయని అక్కడికి సిటీ ప్రజలు చాలామంది వచ్చారు. వజ్రాలు దొరికే గుహ దగ్గర వారంతా చేరి, నానా గందరగోళం చేశారు. దాంతో ప్రశాంతంగా ఉండే అడవంతా గోల గోలగా మారిపోయింది. అది సహించలేని రాము, సోములు వారిని అక్కడినుండి పంపేసే ప్రయత్నం చేశారు. వారు వినలేదు. పైగా రాము, సోముల మీదికే యుద్ధానికి దిగారు.అప్పుడు అడవిలోని జంతువులూ, కోయవాళ్ళూ వచ్చి వారందరినీ అక్కడినుండి తరిమేశారు.

అప్పుడు సోము వజ్రాలెలా ఉంటాయో తను చూసి వస్తానని గుహలోకి వెళ్ళాడు. అంతే! అతను కూడా వజ్రంలా మారిపోయాడు. 'ఎంతకీ బయటికి రాడేమ'ని కోయవాళ్లు ఒక్కొక్కరూ లోపలకు వెళ్ళారు. వెళ్లినవారు అందరూ వజ్రాలుగా మారిపోయారు. లోపలికి వెళుతున్నవారంతా ఏమవుతున్నారని రాము ఆలోచించి కంగారు పడ్డాడు. తను లోపలికి వెళ్ళకుండా వారిని కాపాడటం ఎలాగని యోచించాడు. మార్గం కానక పిచ్చివానిలా అడవిలో తిరుగుతున్న రాముకు ఒక గొప్ప ఋషి కనబడ్డాడు. తన వాళ్లను కాపాడుకొనే ఉపాయాన్ని అతనికి వివరించి వెళ్ళాడు. అదేమంటే ఆ గుహకున్న

మూడో ద్వారం గుండా లోపలికి వెళ్ళి, అక్కడుండే ప్రమాదకరమైన దెయ్యాలను చంపేసి, వాటి రక్తాన్ని వజ్రాలపై చల్లాలి. అప్పుడు వజ్రాలుగా మారిపోయిన జంతువులన్నీ వాటి పూర్వ రూపాన్ని పొందుతాయి!

రాము వెంటనే గుహను చేరుకున్నాడు. కానీ అతనికి అక్కడ ఒక్కటే దారి కనబడింది. మిగిలిన దారులను వెదుకుతుండగా అతనికి చాలా దాహం వేసింది. దగ్గరలోని వాగు దగ్గరికి వెళ్ళి నీళ్ళు తాగుతుంటే, అతనికి వాగులో కొట్టుకుపోతున్న చీమల గుంపొకటి కనబడింది. చాలా వేగంగా పారే ఆ వాగు ప్రవాహం లోకి దూకి ఆ చీమల గుంపును కాపాడాడు రాము. తమను పెద్ద ప్రమాదం నుండి కాపాడిన అతనికి కృతజ్ఞతలు చెప్పి, అందుకు ప్రతిఫలంగా అతనికి ఏమి కావాలో చెప్పమన్నాయి ఆ చీమలు. గుహకున్న మూడో ద్వారాన్ని చూపమన్నాడు రాము. చీమలన్నీ గుహ దగ్గరికెళ్ళి, తలా ఒకదారిన అన్ని చోట్లా వెదికి చివరికి మూడో ద్వారాన్ని కనిపెట్టటమే కాక, అక్కడి పరిస్తితులను సైతం రాముకు వివరించాయి.

అంతా తెలుసుకున్న రాము ఒక చక్కని పథకాన్ని తయారు చేసుకొని మిగిలి ఉన్న కోయవాళ్ళూ, జంతువుల సాయంతో మూడోద్వారం గుండా లోనికి ప్రవేశించాడు. అక్కడి దెయ్యాలన్నింటినీ చంపి, వెంటనే వాటి రక్తాన్ని వజ్రాలమీద చల్లాడు. అంతే! వజ్రాలన్నీ జంతువులుగానూ, కోయవాళ్ళుగానూ మారిపోయారు.

అంతా కలసి ఆనందంగా అడవిని చేరుకున్నారు. ఇంతలో 'నన్ను

సింహం బారినుండి కాపాడిన రామును పెళ్ళి చేసుకుంటాన' ని ఇంగ్లీషావిడ అక్కడికి వచ్చింది. విషయాన్ని ఆమె ఇంగ్లీషులో చెప్పింది. కానీ ఆ మాటలు అడవిలోని చిలకకు తప్ప మరెవ్వరికీ అర్థం కాలేదు.
చివరికి ఇంగ్లీషావిడ మాటలన్నింటినీ చిలుక తెలుగులోకి అనువదించి చెప్పవలసి వచ్చింది. 'తెలుగేరాని ఆమెను రాము ఎలా పెళ్ళిచేసుకుంటాడ'ని అందరూ అన్నారు. ఆ మాటలను చిలుక ఆమెకు ఇంగ్లీషులోకి తర్జుమా చేసి చెప్పింది. అందుకామె తను నెలలోగా తెలుగు నేర్చుకుంటానని ఖచ్చితంగా చెప్పింది. నిజంగానే నేర్చుకుంది కూడానూ! ఆపైన, ఆమె తమ పెద్దలకు కూడా జరిగినదంతా చెప్పి, తనకూ, రామూకూ పెళ్ళి చేయమని కోరింది. అందుకు వాళ్ళు కూడా ఒప్పుకుని రాముకూ, ఆమెకూ వివాహం జరిపించారు. అదే సమయంలో వారి రెండవ అమ్మాయిని సోముకు ఇచ్చి పెళ్ళి చేశారు.

రాము, సోముల పెళ్ళిళ్ల సందర్భంగా అదవిలోని నెమళ్ళు నాట్యం చేశాయి. ఏనుగులు సర్కస్ చేశాయి. గొరిల్లాలు, చింపాంజీలూ అటూ ఇటూ పరుగులు తీశాయి. కోయిలలు పాటలు పాడాయి. సింహాలూ, పులులూ డోలు కొట్టాయి. కాకులూ, పిచ్చుకలూ మేళం ఊదాయి. మైనా మంత్రాలు చదివింది.
ఆ తరువాత రాము సోములు అడవిని, జంతువులను కాపాడుకుంటూ సుఖంగా జీవించారు.

# ఏడుగురు అన్నలు

*'ఏడుగురు అన్నలూ-ఒక్కగానొక్క చెల్లెలు' అని మొదలుపెడితే ఈ కథ 'సిండరెల్లా కథ' అని పొరబడేరు!*
*అటూ ఇటూ తిరిగి ఇది చివరికి చదువు మహాత్మ్యాన్ని చాటుతున్నది! దీన్ని చదివితే ఎలుగుబంటులుండే గుహల్ని మీరూ గుర్తు పట్టగలరేమో, ప్రయత్నించండి.*



*రచన: రేణుక, ఏడో తరగతి, టింబక్టు బడి, చెన్నేకొత్తపల్లి.*

ఒక ఊళ్ళో ఏడుగురు అన్నదమ్ములూ, వారికి ఒక్కగానొక్క చెల్లెలు జాంబవతీ, నివసిస్తూండేవారు. వారు చాలా పేదవారు. అన్నలంతా రోజూ పొలానికి వెళ్ళి
పనులు చేసేవారు. చివరి వాడైన రాజేష్ మాత్రం కుంటివాడు- అందువల్ల అతడు ఇంటి దగ్గరే ఉండేవాడు. చదువు నేర్చుకొని ఎప్పుడూ అనేక రకాల పుస్తకాలు చదువుతూ ఉండేవాడు. చెల్లెలు జాంబవతి ప్రతి రోజూ రాగిముద్దలు చేసుకొని, పొలంలో పనిచేసే అన్నలకు తీసుకెళ్ళేది. ఇదిలా ఉండగా ఒకనాడు రాజేష్ వాళ్ళ అన్నలతో 'ఇక నుండీ నేను కూడా పనికి వస్తాన'న్నాడు. అన్నలు సరేనన్నారు.

అప్పుడు జాంబవతి చెప్పింది: "అన్నలూ! మన ఇంట్లో ఉండే ఒకే ఒక్క పాత్రలో నేను మీకు ప్రతీ రోజూ సద్ది తెస్తున్నాను. ఆ పాత్రలో

ఆరు ముద్దలే పడతాయి. రాజేష్ కూడా వస్తే అతనికి భోజనం తీసుకు రావడానికి మరొక పాత్ర లేదు!" అని. అప్పుడు రాజేషన్నాడు: 'చెల్లీ! నాకు ముద్ద వద్దు. కానీ, చివరన మిగిలే 'మాడు' మాత్రం కొంచెం తీసుకురా చాలు' అన్నాడు.

'సరే'నని జాంబవతి రోజూ వారికి సద్దిని తీసుకొని పొలానికి వెళ్ళేది. ఒకనాడు జాంబవతి అన్నలకు సద్ది తీసుకుపోతూండగా, దారిలో ఒక పెద్ద ఎలుగుబంటి ఎదురయింది. దాన్ని చూసిన జాంబవతి చాలా భయపడిపోయి, తన పనయిపోయిందనుకుంది. కానీ ఆ ఎలుగుబంటి, జాంబవతిని సమీపించి, 'జాంబవతీ! నువ్వు నాకు రోజూ ఒక రాగిముద్ద ఇస్తానంటే నేను నిన్ను ఏమీ చేయను. ముద్దంటే నాకు చాలా ఇష్టం. పైగా ముద్దలో చాలా మంచి పోషకాలుంటాయట! దాన్ని తింటే మంచి బలం కూడా వస్తుందట కదా! అందుకే నేను ముద్దనే కోరుకుంటున్నాను. సరేనా! ఇస్తావా?' అని అడిగింది. జాంబవతి సరేనన్నది. ఎలుగుబంటికి ఒక ముద్దను ఇచ్చి, పరుగు పరుగున అక్కడినుండి పొలానికి వెళ్ళింది. జరిగినదంతా అన్నలతో చెప్పింది.

ఎలుగుబంటి పీడను వదిలించడానికి అన్నలు ఒక ఉపాయం ఆలోచించి, దాన్ని జాంబవతికి చెప్పారు. మరునాడు, అన్నలు చెప్పినట్టుగానే ఒక నున్నటి రాతి గుండుకు పైపైన రాగిముద్దను పూసి, ఎలుగుకు ఇచ్చి, అక్కడినుండి వేగంగా వెళ్ళిపోయింది

జాంబవతి. 'అది ముద్దేనేమో' అని గట్టిగా కొరికిన ఎలుగుబంటికి పళ్ళన్నీ ఊడిపోయాయి. జరిగిన మోసాన్ని తెలుసుకున్న ఎలుగుబంటి, మరునాడు దారిలో కాపు కాసి, జాంబవతిని ఎత్తుకు పోయింది. ఎంతకీ చెల్లెలు సద్ది తీసుకు రానిది చూసి, ఎలుగుబంటే తమ చెల్లెలును ఎత్తుకు పోయుంటుందని గ్రహించిన అన్నలు అడవివైపు పరిగెత్తారు. రాజేశ్ కూడా వారిని వెంబడించాడు పడుతూ లేస్తూ.

అంతలో వారికి ఒక గాడిద కనిపించింది. ఆ గాడిదను పట్టుకోమన్నాడు రాజేష్. అన్నలంతా 'నీకేమైనా పిచ్చా? చెల్లెలు ఏమయిపోయిందో ఆలోచించక, గాడిదను పట్టుకొమ్మంటావేమిటి?' అని రాజేష్ ను తిట్టారు. వారంతా రాజేష్ ను అక్కడే వదిలి వెళ్ళిపోయారు. రాజేష్ మాత్రం శ్రమపడి ఆ గాడిదను పట్టుకొని, అడవిలోకి వెళ్ళాడు. అంతలో అతనికి ఒక ఖాళీ రేకు డబ్బా కనిపించింది. అతను దాన్ని కూడా తీసుకొని ముందుకు సాగాడు. ఇంతలో అతనికి తమ చెల్లెలికోసం అటూ ఇటూ అడవంతా తిరిగి అలసిపోయిన అన్నలంతా కనిపించారు. వారు , ఎలుగుబంటి ఎక్కడున్నదీ కనుగొనలేక పోయారు.

ఎలుగుబంట్లు గుహలలో నివసిస్తాయని వారికి తెలియజెప్పి, రాజేశ్ వారందరినీ తన వెంట రమ్మన్నాడు. అందరినీ కొండమీద గుహలుండే చోటికి తీసుకవెళ్ళాడు. ఎలుగుబంట్లు తేనె పట్టులను

తింటాయనీ, అవి ఉండే గుహ దగ్గర చీమలు ఉంటాయనీ, దాన్ని బట్టి, ఎలుగుబంటి ఉండే గుహ ఏదో కనుక్కోవచ్చని చెప్పాడు. అంతలోనే వారికి చీమల దండ్లున్న గుహ ఒకటి కనిపించింది. వారంతా గాడదను అక్కడికి తోలుకెళ్ళారు. దాని తోకకు డబ్బాను కట్టి, డబ్బాలోకి చిన్నచిన్న గులక రాళ్ళు వేసి, ఆ గాడిదను గుహలోకి అదిలించారు. డబ్బాలోని రాళ్ళు 'డబడబ' అనగానే, బెదిరిన గాడిద గట్టిగా ఓండ్ర పెడుతూ గుహలోకి పరుగెత్తింది. ఆ శబ్దానికి కొండంతా మారుమోగిపోయింది. గుహలోని ఎలుగుబంటి బెదిరి పరుగున బయటికి వచ్చింది. బయట వేచి ఉన్న అన్నలంతా కలసి తమ పనిముట్లతో ఎలుగుబంటిని చంపేసి, గుహలోని తమ చెల్లెల్ని విడిపించుకున్నారు. అందరూ రాజేష్ తెలివిని మెచ్చుకున్నారు. చదివి విజ్ఞానం గడించటంవల్ల ఎన్ని లాభాలున్నాయో అందరికీ తెలిసి వచ్చింది.

# చందమామపై కొంగ

*చందమామ నిజానికి ఓ పేద్ద ఉపగ్రహం. దానిపైన గొప్పగొప్ప పర్వతాలూ, భయంకర అఖాతాలూ కొల్లలుగా ఉన్నాయి. ఆ కొండలూ, లోయలూ మన భూమిమీదికి మచ్చలరూపంలో కనబడుతుంటాయి. అయినా, ఈ మచ్చల గురించిన కథలు మాత్రం అనేకం ప్రచారంలో ఉన్నాయి. 'చందమామపై ముసలవ్వ', 'చందమామపై కుందేలు'లకు తాజాగా నాగమణి ఓ కొంగను కలుపుతున్నది. చదివి చూడండి.*

*సేకరణ: నాగమణి, ఐదవ తరగతి, టింబక్టు బడి*



ఒక ఊళ్ళో ఇద్దరు దంపతులు ఉండేవారు. వాళ్లొకసారి కొట్లాడినారు. ఇద్దరూ ఒకరితో ఇంకొకరు మాట్లాడకుండా ఉన్నారు. పెండ్లామికేమో వక్కాకు (తాంబూలం) వేసుకునే అలవాటుంది. సరిగ్గా అప్పుడే ఆమె దగ్గర సున్నం అయిపోయింది. వక్కాకేసుకుందామని ఆకు తీసి, సున్నంకోసం చూస్తే సున్నం డబ్బా ఖాళీ అయిపోయింది. అప్పుడు ఆమె తన మొగుణ్ణి అడగకుండా సున్నం కోసం వెదికింది. సరిగ్గా అప్పుడే ఒక కొంగ, పైన ఆకాశంలో పోతూ పోతూ రెట్ట వేసింది. అది

తెల్లగా సున్నంలా ఉంది. అదొచ్చి వీళ్ల గోడమీద పడింది. అది సున్నమేనేమో అనుకున్నది ఆ భార్య. ఆమె దాన్ని తీసుకొని ఆకుతో కలిపి నమిలింది. కొన్నాళ్లకు ఆమె గర్భవతి అయ్యింది. ఇంకొన్నాళ్లకు ఆమె ఒక కొంగను ప్రసవించింది!

దాంతో ఆ దంపతులిద్దరూ హతాశులయ్యారు. కానీ ఏమి చేయగలరు? తమకు పుట్టిన బిడ్డాయె! అందరూ వారికి పుట్టిన ఆ కొంగను చూసి వాళ్లను ఎగతాళి చేసేవారు. అయినా చేసేది లేక వాళ్ళా కొంగనే పెంచుకోసాగారు. కొన్నాళ్ళకు ఆ కొంగ పెరిగి పెద్దదయింది. సరిగ్గా అప్పుడే ఆ ప్రాంతంలో పెద్ద కరువు వచ్చింది. మనుషులకు పుట్టిన ఆ కొంగకు గొప్ప గొప్ప శక్తులు వచ్చాయి. అది ఆకాశంలోకి ఎగిరి, దూర ప్రాంతాలలో దొరికే మంచి మంచి పళ్ళూ, కూరగాయలూ వాళ్ల అమ్మా-నాన్నలకు తెచ్చి ఇచ్చేది. అయినా వారికి తీరని బెంగ కొంగ సంతానం. ఆ బెంగతోటే కొంగవాళ్ల అమ్మ మంచాన పడింది. కొంగకు అది చాలా బాధను కలిగించింది. 'అందుకు కారణం తనేకదా' అని, అది ఆకాశంలో చాలాచాలా ఎత్తుకు ఎగురుకుంటూ పోయి, చివరికి చందమామ దగ్గరికి చేరుకొని తన కష్టాన్ని చెప్పుకొంది.

చందమామ దాన్ని ఊరడించి, దాన్ని తనలో కలుపుకున్నాడు. మనం జాగ్రత్తగా చూస్తే నిండు చందమామలో కొంగ కనబడేది అందుకే.

# దురాశ దుఃఖానికి చేటు

*కర్ణాటక రాష్ట్రంలో ఆరవ తరగతి వరకూ చదివిన పుష్ప పోయిన సంవత్సరమే తెలుగు అక్షరాలు నేర్చుకున్నది. సొంతకథ తప్ప వేరేవేమీ తీసుకోమని చెబితే ఆ పాప రాసిన సొంత కథ ఇది. చదివిచూడండి.*




*రచన: పుష్ప, ఏడవ తరగతి, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి.*

అనగనగా ఒక ఊరు . ఆ ఊరిలో ఒక పాప ఉండేది. ఆ పాపకు కేకులంటే చాలా ఇష్టం. ఒకనాడు ఆ పాప నిద్రపోతూండగా కేకులు కలలోకి వచ్చాయి. ఆ కలలో పాప కేకుల కోసం వెతుక్కుంటూ ఒక అడవిలోకి వెళ్ళింది. అడవిలో పాపకొక పెద్ద ఎలుగుబంటి కనిపించింది. పాప ఎలుగుబంటిని 'కేకులెక్కడుంటాయి?' అని అడిగింది. 'కేకులు ఒక పెద్ద కొండమీద ఉన్న పెద్ద మర్రిచెట్టుకింద ఉంటాయ'ని ఎలుగుబంటి చెప్పింది. అంతలోనే పాపవాళ్ల అమ్మ వచ్చి పాపను నిద్రలేపేసింది. అప్పుడు పాప 'ఏంటమ్మా! నా నిద్రంతా పాడుచేశావు?' అని రుసరుసలాడింది. 'సరేగానీ, వెళ్ళు, వెళ్ళి స్నానం చేసిరా! స్కూలుకు వెళుదువుగాని!' అని వాళ్ల అమ్మ అన్నది.

పాప స్కూలుకు వెళ్ళి, రాత్రి తనకొచ్చిన కలను తన మిత్రులందరికీ చెప్పింది. ఇతరులకు చెప్పినకొద్దీ ఆ పాపకు తన కల నిజందే అని ఇంకా ఇంకా అనిపించసాగింది. మరునాడు ఎలాగైనా అడవికి వెళ్ళి

కేకులు సంపాదించాలనుకొంది. రాత్రయింది. అందరూ పడుకున్నాక పాప లేచి అడవిలోకి వెళ్ళింది. అడవిలో నిజంగానే పాపకు ఒక పెద్ద ఎలుగుబంటి ఎదురైంది. తాను కలలో చూసి ఉన్నదే కనుక ఎలుగుబంటిని చూసి పాప భయపడలేదు. బదులుగా 'మర్రిచెట్టుండే కొండ ఎక్కడుంటుంద'ని పాప ఎలుగుబంటినే అడిగింది. ఎలుగు బంటికి పాప ధైర్యం నచ్చింది. అది ముచ్చటపడి, పాపకు ఒక కొండను చూపించింది. పాప కొండెక్కి మర్రిచెట్టుకింద చూస్తే అక్కడ ఒక్క కేకు కూడా కనిపించలేదు. పాపకు చాలా బాధ కలిగింది. గట్టిగా ఏడ్చింది. అంతలోనే మర్రిచెట్టులో ఉండే దేవతలు ప్రత్యక్షమయి, 'ఏమి కావాలో కోరుకో'మన్నారు. పాప 'రెండు బండ్ల కేకులు కావాల'ని కోరుకొంది. దేవతలు రెండు బండ్ల కేకులిచ్చారు. పాప సంతోషపడింది. కానీ తనేమో చిన్నది. అన్ని కేకుల్ని తను ఇంటికెలా తీసుకెళ్ళాలి? 'నువ్వెలా వెళితే బండ్లుకూడా అలాగే నీవెంట వస్తాయ'న్నారా దేవతలు. పాప ముందు నడిస్తే, కేకుల బండ్లు వెనక వెళ్ళాయి. దారిలో పాప ఒక ఎలుగుబంటిని కలిసి, దానికి ఒక బండెడు కేకులను బహుమానంగా ఇచ్చి వెళ్ళింది.



అప్పటికి తెల్లవారింది. పాప వాళ్ళ అమ్మా నాన్నలు లేచి అప్పటికే పాప కోసం వెతుకుతున్నారు. పాప

ఇంటికి చేరుకొని, జరిగినదంతా వాళ్ళకు వివరించింది. కేకులకు బదులుగా బంగారాన్ని కోరుకొని ఉంటే బాగుండునని అన్నారు వాళ్ల అమ్మా, నాన్నలు. అంతే, కేకులన్నీ బంగారంగా మారిపోయాయి! వారందరూ చాలా సంతోషించారు.

అంతలో వాళ్ల పక్కింటావిడ అక్కడికి వచ్చింది. అంతా అడిగి తెలుసుకుంది. ఇంటికెళ్ళి తన భర్తకు చెప్పింది. వాళ్లిద్దరూ మహా ఆశపోతులు. తాము కూడా వెళితే తమకూ బంగారం దొరుకుతుందని ఇద్దరికీ తెగ ఆశ పుట్టింది. మర్నాటి రాత్రి భర్త బయలుదేరి అడవికి వెళ్ళాడు. అతనికీ ఒక ఎలుగుబంటి కనిపించింది. తెలిసిన సంగతే గనక అతను దానిని 'మర్రిచెట్టు ఎక్కడుంటుంద'ని అడిగాడు. కొండపై ఉంటుంద'ని చెప్పింది ఎలుగుబంటి. ఆశకొద్దీ కొండపైకి వెళ్లిన అతన్ని ఒక సింహం చూసి, అతని మీదికి దూకి, చంపి తినేసింది. ఆ విషయం పాప తల్లిదండ్రులకు, ఊళ్ళోని వారందరికీ తెలిసింది. అందరూ బాధ పడ్డారు. అదే ప్రమాదం పాపకు జరిగి ఉంటే ఏం చేసేవాళ్లమని పాప ఇంట్లో వాళ్లు అనుకున్నారు. 'దురాశ దు:ఖానికి చేటు అని పెద్దలు ఊరికే చెప్పలేదు. మా దురాశకు తగిన శాస్తి జరిగింది' అని ప్రక్కింటావిడ దు:ఖించింది. ఏది ఏమైనా, అటు తరువాత పాప మళ్ళీ ఎన్నడూ అలాంటి దుస్సాహసం తలపెట్టలేదు.

# కోడి పెట్ట కథ

*అర్థంలేని కథలు అనేకం పల్లెసీమల్లో పిల్లలనోళ్ళలో నానుతుంటాయి. కోడిపెట్ట కథ అలాంటి వాటిలో ఒకటి.*
*దాని అంతాన్ని ఏదో కొంచెం అర్థవంతం చేసేందుకు చాలా కృషి అవసరమైంది. మీరెవరైనా ఇంకా అందంగా ముగించగలరేమో చూడండి మరి!*



*రచన: సుధ, ఏడవ తరగతి, టింబక్టు బడి, చెన్నేకొత్తపల్లి.*

అనగనగా ఒక ఊరుండేది. ఆ ఊళ్ళో ఇద్దరు దంపతులు ఉండేవారు. వారు మాంసం అంటే చాలా ఇష్టం. ఒకనాడు వాళ్ళిద్దరూ కోడికోసం కోళ్ళ అంగడికి పోయి, ఒక కోడిపెట్టని తీసుకొని ఇంటికెళ్ళారు. అయితే అప్పటికే చీకటి పడింది. దాంతో మరుసటి రోజు తెల్లవారిన తరువాత కోడిని కొసుకోవచ్చుననుకొని, దాన్ని ఒక గంపకింద మూసి, నిద్రపోయారు.



అయితే ఆ కోడి గంపకిందనుండి చాలా తెలివిగా తప్పించుకొని వెళ్ళి, ఒక పెద్ద అడవిలోకి పారిపోయింది. అక్కడ ఒక చెట్టుపైకి ఎక్కి కూర్చొంది. సరిగ్గా అప్పుడే ఆ అడవిగుండా ఒక

ఇటుకల బండి పోతూ ఉన్నది. ఆ బండిలోనుండి కొన్ని ఇటుకలు పడిపోయాయి. కోడిపెట్ట ఆ ఇటుకలను తీసుకొనిపోయి ఒక ఇంటిని కట్టుకొని, దానిలో మూడు గుడ్లను పెట్టింది. ఆ మూడింటినీ పొదిగింది. ఆశ్చర్యం! పొదిగిన గుడ్లు మూడింటినుండీ అందమైన అమ్మాయిలు ముగ్గురు పుట్టారు. ఇలా కొంత కాలం గడిచింది.

అమ్మాయిలు ముగ్గురూ పెరిగి పెద్దవారయ్యారు. వాళ్ళిప్పుడు చాలా అందంగా ఉన్నారు. పెద్దకూతురికీ, రెండవ కూతురికీ తమ తల్లి ఒక కోడి అని చెప్పుకోవడం ఇష్టం ఉండేదికాదు. చిన్న కూతురికిమాత్రం తల్లంటే చాలా ప్రేమ.
ఇలా ఉండగా మూడు రాజ్యాలకు చెందిన ముగ్గురు రాకుమారులు అడవిలోకి వేటకని వెళ్ళారు. వేటాడుతూ వాళ్ళు చాలా తిరిగారు. వారికి చాలా దాహం వేసింది. కానీ ఎక్కడా నీళ్ళు మాత్రం దొరకలేదు. చివరికి రాకుమారులు వేటకుక్కలపై ఆధారపడవలసి వచ్చింది. కుక్కలు ముందు నడవగా రాకుమారులు వాటి వెనకనే వెళ్ళి, కోడి పెట్ట ఇంటిని చేరుకొని, నీళ్ళు అడిగారు. ఇంట్లోనుండీ ముగ్గురు అందమైన అమ్మాయిలు వచ్చి వారికి ముగ్గరికీ నీళ్ళిచ్చారు. వారి అందానికి ముగ్ధులైన రాకుమారులు వారిని 'పెళ్ళి చేసుకుంటామని, తమతో పాటు అంత:పురానికి తీసుకుపోతామ'ని అన్నారు. అందుకు ఆ అమ్మాయిలుకూడా 'సరే'నన్నారు.

పెద్ద కూతుళ్ళిద్దరూ వాళ్ల అమ్మను కూడా పట్టించుకోకుండా, రాకుమారుల వెంట వెళ్ళిపోయారు. మూడవ అమ్మాయి మాత్రం వాళ్ల అమ్మ వచ్చేంతవరకూ ఆగి, తనతో పాటు ఆ కోడిపెట్టనూ తీసుకెళ్ళింది. కొంతకాలం అయ్యాక , కోడిపెట్టకు తన పెద్దకూతుళ్లిద్దరినీ చూడబుద్ధయింది. చిన్న కూతురు వద్దన్నా వినకుండా వారిని చూసి వస్తానని బయలుదేరింది. ముందుగా అది పెద్ద కూతురి ఇంటికి వెళ్ళింది. ఆమె 'నువ్వెవరివో నాకు తెలియదు పొమ్మం'టూ, కోడిమీదికి ఒక కట్టెను విసిరింది. కోడి కాలు విరిగిపోయింది. అది బాధతో రెండవ కూతురి దగ్గరకు వెళ్ళింది. రెండవ కూతురుకూడా కట్టెతో కొట్టింది. దానికి ఒక రెక్క విరిగిపోయింది. నిరాశచెందిన కోడిపెట్ట చాలా బాధతో తిరిగి చిన్న కూతురినే చేరుకున్నది. చిన్న కూతురు ఏడుస్తూ అమ్మను తన ఒడిలోకి తీసుకొంది.

కూతురు ఒడిలో నిస్సహాయంగా పడిఉన్న కోడిపెట్ట తన జీవిత గమనాన్ని ఒకసారి మననం చేసుకున్నది. 'జాలిలేని మనుషుల ప్రపంచం తనను ఒకసారి కసాయి అంగట్లో బలిగోరింది. విది వశాన తను తప్పించుకోగలిగింది. ఆ తరువాత మరోసారి దంపతుల బుట్టక్రిందినుంది పారిపోయి అడవితల్లి రక్షణపొంది, బ్రతికిపోయింది. అయినా తనకు మనుషుల బెడద తప్పలేదు: చివరికి తన సొంత బిడ్డలే మనుషులై, మనుషుల్ని మనువాడి, వారి

సంపర్కంతో తామూ మానవ గుణాలను అలవరచుకొని, తనను అంతం చేస్తున్నారు! కాలగమనంలో మానవజాతికి ఇతర జంతువుల దు:ఖాన్ని అర్ధం చేసుకునే శక్తి కలిగితే తప్ప తమ జాతికి నిష్కృతి లేదు.'

అంతే! కోడిపెట్ట చనిపోయింది. చనిపోయిన కోడిపెట్టను చిన్న కూతురు తమ తోటలో పాతిపెట్టింది. ఆమే, ఆమె భర్త ఇద్దరూ జంతువుల్ని, పక్షుల్ని మనసారా ప్రేమిస్తూ, వాటి రక్షణకై తమ శక్తి యుక్తుల్ని ఆసాంతం వెచ్చించారు.

# కృషి ఫలితం

*'కృషి చేస్తే ఏమైనా సాధించవచ్చు.. కలెక్టర్లు, ఎస్పీలు కూడా కావచ్చు' అని చెప్పటం ఈ రోజుల్లో వెనకబాటు తనమేమో. ఈ మధ్య అయ్యేయెస్ ఆఫీసర్లు, ఐపీయస్సాఫీసర్లు ఉద్యోగాలు వదిలి ప్రైవేటు కంపెనీల్లో మానేజర్లుగా చేరుతున్నారు. మొత్తానికి 'పెద్దవాడవ్వటం అంటే ఏంటి?' అనే ప్రశ్నను పక్కన పెడితే నరేష్ రాసిన ఈ కథ 'పరవాలేదు' అనిపిస్తుంది. మీకెలా అనిపిస్తుందో చెప్పండి.*



*రచన: నరేష్, తొమ్మిదో తరగతి, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి.*



ఒక ఊరిలో రామయ్య అనే రైతు ఉండేవాడు. ఆయనకు ఒక కొడుకుండేవాడు. ఆ అబ్బాయి పేరు సురేష్. రామయ్య తన కొడుకయిన సురేష్ ను బడికి పంపక రోజూ తనతో పాటు పనికి తీసుకెళ్ళేవాడు. అందుకు సురేష్ ఏమీ బాధపడేవాడు కాదు- సాయంత్రం పని నుండి ఇంటికి రాగానే తన మిత్రుడయిన రమేష్ దగ్గరికి వెళ్ళి చదువుకొనేవాడు. స్వతహాగా చురుకైన రమేశ్ కూడా సురేశ్ కు తాను నేర్చినవన్నీ నేర్పిస్తుండేవాడు.

ఒకనాడు రామయ్య తన కొడుకును తీసుకొని సంతకు వెళ్ళాడు. సంతలో అతను ఒక వ్యాపారిదగ్గర నలభై రూపాయలకు సరుకులను కొని, అతనికి 50 రూపాయల నోటును ఇచ్చాడు. ఆ వ్యాపారి దాన్ని తీసుకొన్నాడు, కానీ వ్యాపారపు ఒత్తిడిలో పడి చిల్లర ఇవ్వ మరచాడు. అప్పుడు సురేష్ 'అదేమిటి , మా నాన్న మీకు ఇచ్చిందెంత? మీరు మాకు పది రూపాయలు తిరిగివ్వాలిగా?' అని గుర్తుచేయటం, అప్పుడా వ్యాపారి 'అవున'ని సురేశ్ ని మెచ్చుకొని, పది రూపాయలు తిరిగి ఇవ్వటం జరిగాయి. రామయ్యకు అప్పటికి గాని తన కొడుకు తెలివి తేటలు తెలిసిరాలేదు. ఆక్షణాన్నే రామయ్య ఎన్ని కష్టాలైనా భరించి తన కొడుకును బడికి పంపాలనుకున్నాడు. ఆ మర్నాడే సురేష్ ను ప్రభుత్వ బడిలో చేర్పించాడు.

ఇక ఆనాటినుండీ సురేష్ ఇంకా చాలా బాగా చదువుకున్నాడు. రామయ్యకు ఇప్పుడు చాలా సంతోషంగా ఉన్నది. ఒకనాడు సాయంత్రమైనా సురేష్ ఇంటికి తిరిగి రాలేదు. 'ఏమయి ఉంటుదబ్బా!' అని వాళ్ళ నాన్న కొడుకుకోసం ఎదురు చూస్తుండగా సురేష్ చాలా ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. 'ఎందుకు ఇంత ఆలస్యమయింద'ని రామయ్య సురేష్ ను అడిగాడు. అప్పుడు సురేష్ 'నాన్నా! నేనొచ్చే దారిలో ఒక అబ్బాయికి ప్రమాదంలో చాలా పెద్ద గాయాలయ్యాయి. నేనా అబ్బాయిని లేపి, ప్రథమ చికిత్స జరిపి, వాళ్ల ఇంటిదగ్గర దింపి వచ్చే సరికి ఇంత సమయమయ్యింద'ని

చెప్పాడు. అందుకు వాళ్ల నాన్న కూడా సంతోషపడి, 'నువ్వు చాలా మంచిపని చేశావు బాబూ. నువ్వెప్పుడూ ఇలాగే మంచి పనులు చేస్తూండాలి' అని చెప్పాడు . అందుకు సురేష్ సరేనన్నాడు.

ఇప్పుడు సురేష్ తన మిత్రుడైన రమేష్ తో సమానంగా చదువుతున్నాడు. ఇద్దరూ పదవ తరగతికి వచ్చారు. అన్ని పరీక్షలలోనూ మంచిమార్కులు తెచ్చుకుంటున్నారు. ఒకనాడు బడిలో పరుగు పందెం పెట్టారు. పరుగు పందెంలో రెండు కిలోమీటర్ల దూరం పరిగెత్తాలి.
అందులో సురేష్ ఫస్ట్ వచ్చాడు. బహుమతిని కూడా అందుకున్నాడు. అప్పుడు పరీక్షలకు ఇంకా ఐదు నెలల సమయమే ఉంది. మిత్రులిద్దరూ బాగా చదువుతున్నారు. పరీక్షలు దగ్గర పడ్డాయి. ఇద్దరూ బాగా చదివారు. ఆ రోజు పబ్లిక్ పరీక్షలు రాస్తున్నారు. ఇద్దరూ చాలా బాగా రాశారు. పబ్లిక్ పరీక్షలు అయిపోయాయి. కొన్నాళ్ళకు పరీక్షా ఫలితాలు వచ్చాయి. రమేష్, సురేష్ లు ఇద్దరూ స్టేట్ ఫస్ట్ వచ్చారు. వాళ్ళ ఫోటోలు అన్ని పేపర్లలోనూ వచ్చాయి. వాళ్ల అమ్మా నాన్నలు ఆనందం పట్టలేకపోయారు. మరుసటిరోజు ముఖ్యమంత్రి వాళ్లకు బహుమతికూడా అందించాడు. పై చదువుల్ని ప్రభుత్వం సొంత ఖర్చుతో చదివించగలదని మాట ఇచ్చాడు. రమేశ్ సురేశ్ ల ఆనందానికి మేరలేదు.

పనికి వెళ్ళే సురేష్ అతని మిత్రుడైన రమేష్ తో చదువు చెప్పించుకొని ఎంతటివాడయ్యాడో చూశారా? పొలం పనులకు వెళ్ళేవాడు ఇప్పుడు ముఖ్యమంత్రితోనే బహుమతి అందుకున్నాడు. అలా ఎదుగుతూ, ఎదుగుతూ పట్టుదలతో శ్రమిస్తూ ముందుకు దూసుకెళ్లి ఒకరు కలెక్టరూ, మరొకరు ఎస్పీ అయ్యారు. దేశానికి ఉపయోగపడే మంచి పౌరులయ్యారు. పట్టుదల, నిజాయితీ, తగిన కృషి ఉంటే ఎంతటి పనినైనా సాధించవచ్చు. సమాజానికి మేలు చేకూర్చే మంచిపనులు చేయవచ్చు.

# తల్లి ప్రేమ

*మర్యాద రామన్నగారి కథల్లో పేరుగాంచిన ఈ కథ మీకందరికీ తెలిసే ఉంటుంది. బిడ్డను కోసి పంచుకోటానికి తల్లి ఒప్పదన్న సున్నితమైన అంశం ఆధారంగా అల్లిన ఈ కథ తరతరాలుగా తెలుగు పిల్లల్ని అలరిస్తూనే ఉన్నది. మరోసారి మీరూ గుర్తుచేసుకొని ఆనందించండి:*



*సేకరణ : ఓం లత, ఐదవ తరగతి, టింబక్టు బడి*

అనగనగా ఒక రాజ్యం. ఆ రాజ్యంలో ఒక ఊరు. ఆ ఊరిలో ఒకాయన తన ఇద్దరు భార్యలు- అమల,కమల లతో నివసిస్తూ ఉండేవాడు. వారిద్దరూ ఒకేసారి గర్భవతులయ్యారు, ఒకేసారి ప్రసవించారు కూడా. పెద్ద భార్య అయిన అమలకు మగపిల్లాడు పుట్టాడు. రెండవ భార్య అయిన కమలకు ఆడపిల్ల పుట్టింది.

ఆ రోజుల్లో కూడా కొడుకంటేనే అందరికీ ప్రీతి. కమల తనకు ఆడపిల్ల పుట్టటాన్ని భరించలేకపోయింది. "తనకే మగ పిల్లాడు పుట్టాడు, కానీ అమల పిల్లలను మార్చి తనకొడుకును కాజేయజూస్తున్నద"ని గొడవ మొదలు పెట్టింది. ఈ సమస్య రానురాను పెద్దదైపోయింది. ఎవ్వరికీ దీని పరిష్కారం తెలీలేదు.

చివరికి సమస్య మర్యాద రామన్నగారి దగ్గరకు చేరుకున్నది. మర్యాద

రామన్న ఆ ఇద్దరినీ పిల్లలను తీసుకొని రాజభవనానికి రావలసిందిగా ఆదేశించాడు. రామన్నగారి ఆజ్ఞ ప్రకారం వారిద్దరూ పిల్లలను తీసుకొని కచేరీకి వెళ్ళారు. అక్కడ రామన్న "అబ్బాయి ఎవరికి కలిగాడు" అని అమలను అడిగాడు. "తనకే బాబు పుట్టాడ"ని చెప్పింది అమల. అంతలోనే కమల "లేదు లేదు, బాబు నాకే పుట్టాడు!" అని గట్టిగా ఏడుస్తూ మొత్తుకున్నది. సభలోని వారందరూ రామన్నఈ సమస్యను ఎలా పరిష్కరిస్తాడోనని కుతూహల పడ్డారు.



అప్పుడు రామన్న కొంచెం ఆలోచించి, అన్నాడు- "సరే! మీరిద్దరూ బాబు మీవాడే అంటున్నారు కదా! బాబు మీ ఇద్దరికీ దక్కాలి. అలా ఇద్దరికీ దక్కాలంటే వేరే మార్గం లేదు. ఆ అబ్బాయిని రెండు ముక్కలు చేస్తే సరిపోతుంది. చెరొక ముక్కా తీసుకోవచ్చు" అని తన కత్తిని ఒర నుండి బయటికి లాగాడు. సభ అంతా నివ్వెరపోయింది. మరుక్షణంలో అమల గట్టిగా అరిచింది: "వద్దు, వద్దు! నా బాబును ఏమీ చేయకండి! కావాలంటే బాబును కమలకే ఇచ్చేయండి.

ఎక్కడున్నా నాబాబు క్షేమంగా ఉంటే నాకంతే చాలు" అని గట్టిగా ఏడ్చింది.

రామన్న కమల వైపుకు చూశాడు. తలవంచుకున్న కమల మారుపలకలేదు. "నిజమైన తల్లి ఎవరైనా కొడుకు మరణాన్ని భరించదు. ఎక్కడున్నా తన కొడుకు బాగుండాలనే కోరుకొంటుంది. అమల కూడా అదే చేసింది. కాబట్టి ఆ అబ్బాయి అమల కొడుకే" అని తేల్చిచెప్పాడు రామన్న. అవాక్కైన కమల తన తప్పును ఒప్పుకుంది.

తప్పూ తేలింది; న్యాయమూ జరిగింది; రామన్నగారి ఖ్యాతీ పెరిగింది.

# భారతాంబిక

*గానం: రాజేశ్వరి, ఏడవ తరగతి, ప్రభుత్వ ప్రాధమికోన్నత పాఠశాల, భావురావుపేట, చెన్నూరు మండలం, ఆదిలాబాదు జిల్లా.*

*చిత్రం: శివ ప్రసాద్, బి యఫ్ ఎ (మొదటి సంవత్సరం), జె యన్ టి యు, హైదరాబాదు.*



భారతాంబిక పునర్వైభవ ప్రాప్తి కొరకే అంకితం
కోట్లకొలదిగ భారతీయులు సమర్పించే వందనం
|భారతాంబిక పునర్వైభవ|

కవుల కలముల జాలువారే కవిత్వామృత ధారలన్నీ
గాయకుల గొంతులను పలికే  మధురమౌ నిస్వనములన్నీ
భావుకుల గుండెల్లొ ఉరికి-పరుగులిడు భావమ్ములన్నీ
భావుకుల గుండెల్లొ ఉరికి-పరుగులిడు భావమ్ములన్నీ
|భారతాంబిక పునర్వైభవ|

హలం పట్టి పొలం దున్నే కర్షకుల కరములను సత్తువ
శక్తినంతా చెమట చేసే శ్రామికుల నరములను బిగువ
కత్తి పట్టి కదం త్రొక్కే వీర సైనిక ధీర హృదయం
కత్తి పట్టి కదం త్రొక్కే వీర సైనిక ధీర హృదయం
|భారతాంబిక పునర్వైభవ|

నవతకోరే యువత గుండెల ఉరకలెత్తే నవోత్సాహం
సకల శాస్త్ర విజ్ఞానవేత్తల పాండితీ ప్రాకర్షలన్నీ
సకలశాస్త్ర విజ్ఞానవేత్తల పాండితీ ప్రాకర్షలన్నీ
|భారతాంబిక పునర్వైభవ|

అన్ని కళలూ అన్ని విద్యలు వృత్తులూ ప్రవృత్తులన్నీ
ప్రాంత భాష కులమతమ్ముల భేదములు ఛేదించుకుంటూ
దేశ శ్రేయమె ధ్యేయమ్మై , నిజ దేశరక్షణ ధీక్షగైకొని
దేశ శ్రేయమె ధ్యేయమ్మై , నిజ దేశరక్షణ దీక్షగైకొని
|భారతాంబిక పునర్వైభవ|

# ఆదిలాబాదు జిల్లారా

*గానం: రాజేశ్వరి, ఏడవ తరగతి,ప్రభుత్వ ప్రాధమికోన్నత పాఠశాల, భావురావుపేట, చెన్నూరు మండలం, ఆదిలాబాదు జిల్లా.*



ఆదిలాబాదు జిల్లారా
ఇది ఎర్రనీ అడవిమల్లెరా

పచ్చనిఅడవంతా ఆకాశమైతే
పల్లెలన్నీ జాబిలమ్మలు
ఈ గోండులే వేగు చుక్కలురా
|ఆదిలాబాదు జిల్లారా|

తిరుగుబాటుకూ తిలకాన్ని దిద్దిన
ఇంద్రవెల్లికి పురుడు పోసిందిరా |ఇంద్రవెల్లికి |
తూటాలు దించిన పాతర పేల్చిన
కడుపుకోత అనుభవించిందిరా |కడుపుకోత|

తిరుగుబాటుకూ తిలకాన్ని దిద్దిన
ఇంద్రవెల్లికి పురుడుపోసిందిరా
తూటాలుదించిన పాతర పేల్చిన
కడుపుకోత అనుభవించిందిరా

పోరుల్లో పారిన నెత్తుటి వరదల్ని
మట్టి దోసిళ్లతో పట్టిందిరా
|ఆదిలాబాదు జిల్లారా|

కొమరం భీముని సమరాన నడిపిన
ఆదివాసులా కన్నమ్మరా |ఆదివాసులా |
కొండకోనల్లో గుండెల్ల తిరుగాడే
లంబాడికోయెల పుట్టిల్లురా |లంబాడికోయెల|
కొమరం భీముని సమరాన నడిపిన
ఆదివాసుల కన్నమ్మరా
కొండకోనల్లో గుండెల్ల తిరుగాడే
లంబాడి కోయల పుట్టిల్లురా
ఎండల్లో అలసిన ఎన్నెన్నో గుండెల్ని
చల్లబరచే నీళ్ల రంజనురా
|ఆదిలాబాదు జిల్లారా|

ప్రాణహిత నది గోదారి అలలకు
ఒడిలోన నడకల్ని నేర్పిందిరా |ఒడిలోన|
పచ్చిక పైరుల పచ్చాని అడవుల్ని
తలమీద కురుల్లోన ముడిచిందిరా |తలమీద|
ప్రాణహిత నది గోదారి అలలకు
ఒడిలోన నడకల్ని నేర్పిందిరా
పచ్చిక పైరుల పచ్చాని అడవుల్ని

తలమీద కురుల్లోన ముడిచిందిరా
లేలేత చిగురుల నిలిచిన
వృక్షాల వనదేవిగా పేరు మోసిందిరా
|ఆదిలాబాదు జిల్లారా|

రాతికొండలను పిండిగా పొడిచేసి
కట్టడాలకు కండ అయ్యిందిరా |కట్టడాలకు|
కలపాను కరనమిలి కాగితమ్మును చేసి
చదువులమ్మకు తోడు నిలిచిందిరా |చదువులమ్మకు తోడు|
రాతికొండలను పిండిగ పొడిచేసి
కట్టడాలకు కండ అయ్యిందిరా
కలపను కరనమిలి కాగితమ్మును చేసి
చదువులమ్మకు తోడు నిలిచిందిరా
గుండెల్లో తరగని గనులెన్నో
పొదిగిన  సిరులా రాణి సింగరేణిదిరా
|ఆదిలాబాదు జిల్లారా|

పచ్చని అడవంత ఆకాశమైతే
పల్లెలన్నీ జాబిలమ్మలు
ఈ గోండులే వేగు చుక్కలురా
|ఆదిలాబాదు జిల్లారా|

# అమ్మా అమ్మా

*గానం: రాజేశ్వరి, మూడవ తరగతి, ప్రభుత్వ ప్రాధమికోన్నత పాఠశాల, భావురావుపేట, చెన్నూరు మండలం, ఆదిలాబాదు జిల్లా.*

అమ్మ -  అమ్మ  నాన్న వచ్చె
నాన్న నాకు  పలకతెచ్చె
పలక  నేను  పంతులుకిస్తె
పంతులు  నాకు  అ ఆ లిచ్చె
అ ఆ లు నేను  అమ్మా కిస్తే
అమ్మ  నాకు  ముద్దు  ఇచ్చె.



# అమ్మమ్మా జీడిపప్పు

*గానం: శ్రీశైలం,నాల్గవ తరగతి, ప్రభుత్వ ప్రాధమికోన్నత పాఠశాల, భావురావుపేట, చెన్నూరు మండలం, ఆదిలాబాదు జిల్లా.*



అమ్మమ్మ - జీడిపప్పు మాడిపోతాంది
అమ్మమ్మా జీడిపప్పు మాడిపోతాంది
పక్కకున్న రైలు పారిపోతాంది
బిస్కెట్ డబ్బాలో బావున్నాడు
బావను చూస్తే సిగ్గైతాంది
పీటమీద కూర్చుంటే పెళ్ళైతాంది

# అంగడమ్మో అంగడి

*గానం: s. రవళి, నాల్గవ తరగతి, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, భావురావుపేట, చెన్నూరు మండలం, ఆదిలాబాదు జిల్లా.*



అంగడమ్మ అంగడి
ఆదివారం అంగడి
కొత్త కుండల అంగడి
కొత్త చీరల అంగడి
కాయగూరల అంగడి
కసిరికాయల అంగడి
మా ఊరి అంగడి
మామిడి కాయల అంగడి
అమ్మలక్కల అంగడి
అక్కబావల అంగడి
అంగట్లో బేరము
భలే భలే బేరము
అంగడమ్మ అంగడి
ఆదివారం అంగడి

# బర్రె బర్రె ఏమిస్తావ్

*గానం: సాయి ప్రియ, నాల్గవ తరగతి, ప్రభుత్వ ప్రాధమికోన్నత పాఠశాల, భావురావుపేట, చెన్నూరు మండలం, ఆదిలాబాదు జిల్లా.*



బర్రె బర్రె ఏమిస్తావ్?
కడివెడు పాలు నేనిస్తా

పాలూ పాలూ ఏమిస్తావ్?
గడ్డ పెరుగు నేనిస్తా

పెరుగూ పెరుగూ ఏమిస్తావ్?
మెత్తటి వెన్నను నేనిస్తా

వెన్నా వెన్నా ఏమిస్తావ్?
కమ్మటి నెయ్యి నేనిస్తా

నెయ్యి నెయ్యి ఏమిస్తావ్?
బుద్ధీ బలమూ నేనిస్తా.

# బటానిత్తు బటానిత్తు

*గానం : శ్రీశైలం, నాల్గవ తరగతి, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, భావురావుపేట, చెన్నూరు మండలం, ఆదిలాబాదు జిల్లా.*



బటానిత్తు బటానిత్తు బాగున్నావా?
అమ్మగారింటికాడ బొమ్మలాట
అన్నయ్య దెచ్చిండు పట్టుచీర
ఎట్లెట్ల కడదాం వదినమ్మా?
ముడేసి కడతా ముచ్చెమ్మా!
బెల్లంపల్లికి పోయిండు
కోడెక్కజ్జెల్ తెచ్చిండు
బావి చుట్టూ తిరిగిండు
బావిలో పడి చచ్చిండు.

# దోమా దోమా ఏ ఊరు

*గానం: రజిత, మూడవ తరగత, ప్రభుత్వ ప్రాధమికోన్నత పాఠశాల, భావురావుపేట, చెన్నూరు మండలం, ఆదిలాబాదు జిల్లా.*



దోమా దోమా ఏ ఊరు?
మురికీ గుంటా మా ఊరు.

ఈగా ఈగా ఏ ఊరు?
చెత్తా కుండీ మా ఊరు.

నల్లీ నల్లీ ఏ ఊరు?
కుక్కీ మంచం మా ఊరు.

పురుగూ పురుగూ ఏ ఊరు?
పేడా దిబ్బా మా ఊరు!

# గణితంలో ఏముంది

*గానం : స్వాతి, ఐదవ తరగతి, ప్రభుత్వ ప్రాధమికోన్నత పాఠశాల, భావురావుపేట, చెన్నూరు మండలం, ఆదిలాబాదు జిల్లా.*



గణితంలో ఏముంది?
గాబర అసలే పడకండీ
గణితంలో ఏముందీ?
గాబర అసలే పడకండీ

తాటి చెట్టు పొడుగుందీ
ఈత చెట్టు పొట్టిగుందీ
తాటి చెట్టు పొడుగుందీ
ఈత చెట్టు పొట్టిగుందీ
|గణితంలో|

నాన్న చొక్కా పెద్దగుందీ
నా చొక్కా పొట్టిగుందీ
నాన్న చొక్కా పెద్దగుందీ
నా చొక్కా పొట్టిగుందీ
|గణితంలో|

# మా బావ వీరుడు

*గానం : s.రవళి, నాలుగో తరగతి, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, భావురావుపేట, చెన్నూరు మండలం, ఆదిలాబాదు జిల్లా.*

*చిత్రం: సాయి కిరణ్, బి యఫ్ ఎ (రెండవ సంవత్సరం), జె యన్ టి యు, హైదరాబాదు.*



మా బావ వీరుడు
మంచం దిగడు

చీమంటే చాలు
చిందులేస్తాడు

ఎలకంటే చాలు
ఎగిరి దుంకుతాడు

పామంటే చాలు
పారిపోతాడు

# మామా మామా మామిడి

*గానం: వనిత, నాల్గవ తరగతి, ప్రభుత్వ ప్రాధమికోన్నత పాఠశాల, భావురావుపేట, చెన్నూరు మండలం, ఆదిలాబాదు జిల్లా.*

మామా మామా మామిడిపండు
మామా నెత్తి  బోడిగుండు
అల్లం బెల్లం తెచ్చిండు
అందరికీ ఇచ్చిండు
పెద్ద గుండు ఎత్తిండు
మోయలేక ముక్కిండు
కాలు జారి పడిండు
కర్ర చేత పట్టిండు.



# నాకాళ్ల గజ్జెల్

*గానం : శివాని, మూడవ తరగతి, ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల, భావురావుపేట, చెన్నూరు మండలం, ఆదిలాబాదు జిల్లా.*



నా కాళ్ల గజ్జెల్
మోకాళ్ల చిప్పల్
అబ్బబ్బ నడుము
అద్దాల రవిక
ముక్కుకు ముక్కెర
కళ్ళకు కాటుక
కస్తూరి బొట్టు
నెత్తిమీద కుండ
కుండనిండ పెరుగు
పెరుగోయమ్మ పెరుగు
తిరుగోయమ్మ తిరుగు